క్లుప్తంగా

పిల్లల భద్రత, రక్షణ అందరి బాధ్యత



స్వేచ్ఛ ఫర్ లిటిల్ బర్డ్స్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: కాకినాడ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, పడాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూపొందించిన స్వేచ్ఛ ఫర్ లిటిల్ బర్డ్స్ పోస్టర్‌ను మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్, రాష్ట్ర రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ వైడీ రామారావు, పడాల చారిటబుల్ ట్రస్ట్ సీఈవో పి.సూర్యప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల భద్రత, రక్షణ మనందరి బాధ్యత అని ప్రతి పాఠశాల, కళాశాల, హాస్టళ్లు, ఇంట్లో పిల్లలు క్షేమంగా ఉండాలన్నారు. కాకినాడ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, పడాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వేచ్ఛ ఫర్ లిటిల్ బర్డ్స్ పేరుతో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఒకటి నుంచి ఏడో తరగతి విద్యార్థినులకు గుడ్, బ్యాడ్ టచ్, సేఫ్టీ రూల్స్, పోక్సో చట్టం, వ్యక్తిగత భద్రత, ఎడ్యుకేషన్ మాడ్యూల్ ద్వారా అవగాహన కల్పించనున్నట్టు ఆయన వివరించారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



వాకాడలో తల్లిదండ్రులకు అడ్మిషన్ పత్రాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

కరప: ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత ప్రమాణాలు గల ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని జిల్లా యుటీఎఫ్ ప్రధాన కార్యదర్శి నగేష్ కోరారు. ఎన్రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా మంగళవారం వాకాడలో ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులతో కలసి ఇంటింటికీ తిరిగి తల్లిదండ్రులను కలసి ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా అమలుచేస్తున్న పథకాలు, మధ్యాహ్న భోజన పథకం, విద్యాబోధన గురించి వివరించి, చైతన్యపరచారు. ఈ సందర్భంగా తల్లి దండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పించి 15 మందికి అడ్మిషన్లు ఇచ్చారు. మాజీ ఉప సర్పంచ్ దూడల నారాయుడు, హెచ్‌ఎం సునంద, మండల యూటీఎఫ్ అధ్యక్షుడు అర్జున్, నాయకులు పి.రాజబాబు, కె.సుబ్రహ్మణ్యం, ఎండీ అలీమ్, కె.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి



కరప గ్రామసభలో మాట్లాడుతున్న వీఎఫ్‌ఏ గాయత్రీ రమాదేవి

కరప: ఆక్వా రైతులకు మేలు చేసేందుకు నిర్వహిస్తున్న గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సాదే ఆశాజ్యోతి అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆమె మాట్లాడారు.

వీఎఫ్‌ఏ వి.గాయత్రీ రమాదేవి మాట్లాడుతూ ఆక్వా జోన్ ఏర్పాటుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆక్వా రైతులు తమ భూములు ఆక్వా జోన్ పరిధిలో లేకపోతే వెంటనే నమోదు చేయించుకుని, రెగ్యులర్ చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలు, రాయితీలు పొందాలంటే రొయ్యల, చేపల చెరువులు ఆక్వాజోన్‌లో ఉండాలని వీఎఫ్‌ఏ గాయత్రి వివరించారు. తర్వాత కొరిపల్లి, పెనుగుదురు, నడకుదురు, గొర్రిపూడి, పెద్దాపురప్పాడు గ్రామాల్లో కూడా గ్రామసభలు నిర్వహించి, ఆక్వాజోన్ ఏర్పాటుపై రైతులతో చర్చించి, దానివల్ల కలిగే ప్రయోజనాలను మత్స్యశాఖ ప్రతినిధులు వివరించారు. ఏఈఓ ప్రశాంత్, వీఎఫ్‌ఏలు పి.నాగశ్రీ, బి.శిరీష, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ దాడులు

ప్రత్తిపాడు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని కిర్లంపూడి మండలం కృష్ణవరం గ్రామంలో మంగళవారం సారా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు విస్తృత దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 1,200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఆయన తెలిపారు.

ఏలేశ్వరం మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఐదుగురు పాత నేరస్తులను అదుపులోకి తీసుకుని, వారిపై బైండోవర్ నమోదు చేశామన్నారు. వీరిని మంగళవారం ఏలేశ్వరం తహసీల్దార్ వద్ద హాజరుపరచినట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ శివప్రసాద్ తెలిపారు.

అమృతఫలానికి రసాయనం

- కృత్రిమంగా మాగబెడుతున్న వ్యాపారులు
- పక్వానికి రాకుండానే విక్రయాలకు సిద్ధం
- నిషేధాజ్ఞలు ఉన్నా ఎవరిదారి వారిదే
- అడ్డంగా మోసపోతున్న ప్రజానీకం



విక్రయానికి సిద్ధంగా ఉన్న మామిడి పండ్లు

బాలాజీచెరువు: వేసవి కాలం వచ్చిందంటే చాలు అమృతఫలంపైనే ప్రజల దృష్టంతా. ఎన్ని రకాల పళ్లో.. పంచదార కల్తీ అని, కలెక్టర్‌కాయనీ, రసాలనీ, గంగాబొండాలనీ, కొత్తపల్లికొబ్బరనీ కొన్ని కాయలుగా కోసి తినడానికైతే, మరికొన్ని పిండుకుని తినేవి. ఇవి కాక ఇంకొన్ని రకాలు ఊరగాయ కోసం వినియోగిస్తుంటారు. సంపన్నుడు నుండి సామాన్యుడు వరకూ మామిడి రుచి అస్వాదించాలని కోరుకునేవారే. అతిగా తింటే ఉడుకుచేస్తుందని తెలిసినా తినకుండా ఉండలేని చాపల్యం. ఏదేమైనప్పటికీ అందరూ మామిడి పళ్లకీ, కాయలకీ ప్రియులే. ఇలా అందరికీ పసందైన మామిడి వేసవి కాలంలో ప్రారంభం కావడంతో మార్కెట్‌ను ముంచెత్తుతాయి. సాధారణంగా దిగుబడి బాగుంటే ధర సామాన్యుడికి అందుబాటులో ఉండి సహజసిద్ధమైన రుచిని ఆస్వాదించే అవకాశం ఉంటుంది. కానీ కాలం కలసిరాక పూత రాలిపోయి, దిగుబడి తగ్గిన సందర్భాల్లో కాయలోనూ, రుచిలోనూ అసహజత్వం స్పష్టంగా కనపడుతుంది. కొన్ని చోట్ల పండ్లను పరిశీలిస్తే పైన పటారం లోన లోటారం అన్న చందంగా ఉన్నాయి. గాలికి రాలిన కాయలను వ్యాపారులు ప్రమాదకరమైన కాల్షియం కార్బైడ్ ద్రావణాన్ని కాయలపై పిచికారీ చేసి కృత్రిమంగా మాగించి తెచ్చి విక్రయిస్తున్నారు. ఇవి ఆరోగ్యానికి హానికలిగిస్తాయన్న ఉద్దేశంతో ప్రభుత్వం 2012లో వీటి విక్రయాలను, కృతిమంగా మాగించే విధానాన్ని నిషేధించింది. ఆరోగ్యకరమైన పద్ధతుల్లో సహజత్వానికి దగ్గరగా మాగించాలని సూచించింది. సాధారణంగా పండ్లు పక్వానికి వచ్చినప్పుడు ప్రకృతి సిద్ధంగా వాటి నుంచి ఉత్పత్తి అయ్యే ఇథిలీన్‌తో మాగుతాయి. ఇథిలీన్ పండు పక్వానికి వచ్చినప్పుడు దాని నిర్మాణ రంగు, రుచి వంటి మార్పులకు ఉపయోగపడుతుంది.

ప్రత్యామ్నాయ రసాయనాలు..

తప్పని పరిస్థితుల్లో కాయలను మాగబట్టేందుకు వినియోగదారుకు హాని కలిగించని ఇథిలిన్ వాయువు 100 పీపీఎం మాత్రమే వినియోగించాలి. దీనిని 24 గంటల పాటు తగిలేటట్టు ఉంచితే ఐదు రోజుల్లో సహజత్వానికి దగ్గరగా ఎలాంటి హానీ లేకుండా మాగించవచ్చు. మామిడిని కోత అనంతరం 10 లీటర్ల నీటికి 13 ఎంఎల్ ఎత్రిన్ కలిపి అందులో మంచిగా ఆరబెడితే సహజత్వానికి దగ్గరగా మారతాయి. గడ్డి కింద కాయలను మాగబెట్టాలనుకుంటే మరింత సురక్షితం.

తేడాలు గుర్తించాలి

సహజంగా మాగిన పండు రంగు కొంత పసుపు, కొంత ముదురు ఆకుపచ్చ రంగులో ఉండి పండు లోపలి భాగం పరిపక్వంగా ఉంటుంది. కృత్రిమంగా మాగినవి ఒకే విధంగా కాంతివంతంగా లేత పసుపు కలిగి ఉంటాయి. పైకి మాగినట్లు కనిపించినా లోపల ఆపరిక్వంగా ఉండి పుల్లగా ఉంటాయి. కృత్రిమంగా మాగినవి దూరం నుంచే వాటి వాసన బట్టి చెప్పవచ్చు.

మే నెలలో పూర్తిస్థాయి విక్రయాలు



సీజన్ రాకముందే మామిడిపండ్లు తికూడదు. సాధారణంగా మామిడి పళ్లు ఏప్రిల్ చివరి వారం మే నెలలో పూర్తిస్థాయిలో వస్తాయి. మార్చి నుంచే కాయలు కోసి వాటిని రసాయనాలతో మగ్గించి విక్రయిస్తున్నారు. తద్వారా ముఖ్యంగా చిన్నపిల్లల్లో దగ్గు వంటి సమస్యలు వస్తాయి. పండ్లను ముందుగా ఉప్పు కలిపి 15 నుంచి 20 నిముషాలు నీటిలో ఉంచి తర్వాత తడి లేకుండా తినాలి. సాధ్యమైనంత వరకూ తొక్కలేకుండా తినాలి.

– డాక్టర్ మాలోతు రమేష్, ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి, జేఎన్‌టీయూకే

బార్ ఎన్నికలకు రెండో రోజు 14 నామినేషన్లు



నామినేషన్లు దాఖలు చేస్తున్న న్యాయవాదులు

కాకినాడ లీగల్: ఈ నెల 21వ తేదీన జరిగే కాకినాడ బార్ అసోసియేషన్ ఎన్నికలకు మంగళవారం 14 నామినేషన్లు దాఖలయ్యాయి. రెండో రోజు అధ్యక్ష పదవికి పి.ప్రసన్న కుమార్ నామినేషన్ దాఖలు చేశారు. ఉపాధ్యక్ష పదవికి పి.రామచంద్రరాజు, జాయింట్ సెక్రటరీ పదవికి వెలిగొట్ల శ్రీనివాస్, బండి నరేంద్ర, కోశాధికారి పదవికి జి.వెంకట దుర్గ ప్రసాద్, లైబ్రరీ సెక్రటరీ పదవికి గండికోట కల్యాణి, షేక్ అమీర్ జానీ, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ పదవికి జోకా.వి.ఎస్.విజయకుమార్, మహిళా ప్రతినిధి పదవికి జి.దివ్య శ్రీ విద్య, సూపర్ సీనియర్ కమిటీ మెంబర్‌గా కె.శ్రీవాణి, సీనియర్ కమిటీ మెంబర్‌గా యెర్మల్ వసంత కుమారి, మహిళా కమిటీ మెంబర్‌గా పెంకే శ్రీదేవి, కమిటీ మెంబర్లుగా షేక్ ప్రేమ్ నజీర్, గుత్తుల మంగరాజు నామినేషన్లు దాఖలు చేశారని, బుధవారంతో నామినేషన్ల ప్రక్రియ ముగియనుందని ఎన్నికల అధికారి ఎం.విశ్వేశ్వరరావు, అసిస్టెంట్ ఎన్నికల అధికారి చెక్కా శ్రీనివాస్ తెలిపారు.

పది రోజులైనా బాధితులను పట్టించుకోరా



అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర విద్యాసాగర్, కొడా మాజీ చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి

బోట్‌క్లబ్: అగ్ని ప్రమాదం జరిగి పదిరోజులైనా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని కొడా మాజీ చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర విద్యాసాగర్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక దుమ్ములపేటలో అగ్నిప్రమాదం జరిగి పది రోజులైనప్పటికీ ఇప్పటికీ కూటమి ప్రభుత్వం వారికి ఏ విధమైన సహాయం చేయలేదన్నారు. స్థానిక నాయకుల ద్వారా అగ్ని ప్రమాద విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి వారికి అండగా నిలవాలని చెప్పడంతో మంగళవారం బాధితులకు ధైర్యం చెప్పినట్లు చెప్పారు. వారికి ఆర్థిక సహాయం కూడా అందించినట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అగ్ని ప్రమాదం సంభవిస్తే అదే రోజు వారికి ఆర్థిక సహాయం చేసిన సందర్భాలు అనేకం ఉన్నాయన్నారు. నేటికి పది రోజులైనా ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల ప్రస్తుతం వారి కుటుంబం రోడ్డున పడిందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వ పెద్దలు స్పందించి అగ్నిప్రమాద బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణాలు



శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

కాకినాడ సిటీ: న్యూ రైల్వే పోర్ట్ స్టేషన్ వెంకటేశ్వరనగర్‌లో అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర దేవాలయంలో మంగళవారం సీతారాముల దివ్య కల్యాణాన్ని బ్రహ్మశ్రీ పుల్లేటికుర్తి సుబ్రహ్మణ్య శివాచార్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అలాగే వెంకటేశ్వరనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. ఈ ఆలయం 1964లో మల్లవరపు సత్యనారాయణ నిర్మించారని కమిటీ సభ్యులు గాది శివరామకృష్ణ తెలిపారు. శివపార్వతుల కల్యాణం సందర్భంగా వివిధ రకాల పూలు, ద్రవ్యాలతో పూజలు నిర్వహించినట్టు తెలిపారు. అనంతరం భక్తులకు భారీ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మల్లవరపు దీపక్, సత్యకుమారి, పారుపు రమేష్, సూర్య ప్రదీప్, హేమ తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు.

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామ స్వామి ఆలయంలో స్వయం ప్రకాశంగా వెలసిన వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ యర్రా వేంకటేశ్వర్రావు స్వామి వారికి పట్టు వస్త్రాలు అందించారు. పండితులు శాస్త్రోక్తకంగా ఈ కల్యాణాన్ని నిర్వహించారు. కన్యాదానం, జీలకర్ర బెల్లం, తలంబ్రాలు వంటి ఘట్టాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు పాణింగపల్లి మాధవాచార్యుల ఆధ్వర్యంలో ఈ కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



వేంకటేశ్వరుని కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పండితులు

హెచ్‌సీ భార్యకు చెక్కు అందజేత



అప్పారావు భార్య రాధకు చెక్కును అందజేస్తున్న ఏపీఎస్పీ కమాండెంట్ నాగేంద్రరావు

కాకినాడ రూరల్: ఏపీఎస్పీ మూడో బెటాలియన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఇటీవల అనారోగ్యంతో మరణించిన జి.అప్పారావు కుటుంబానికి మంజూరైన రూ.1,67,850 చెక్కును మృతుడి భార్య రాధకు కమాండెంట్ నాగేంద్రరావు అందజేశారు. బెటాలియన్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ హెచ్‌సీ అప్పారావు మృతి బాధాకరమని, ఆయన కుటుంబానికి అండగా ఉంటామని కమాండెంట్ తెలియజేశారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ ఎస్.దేవానందరావు, అసిస్టెంట్ కమాండెంట్‌లు మన్మధరావు, మోహనరావు, ఆర్ఐ రవిశంకర్ పాల్గొన్నారు.

తమ్మవరంలో మెగా వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న లయన్స్ గవర్నర్ ఈశ్వర్‌కుమార్


కాకినాడ రూరల్: మండలంలోని తమ్మవరం గ్రామంలో లయన్స్ క్లబ్ సంకల్ప్ సభ్యుల ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఈవీవీ ఈశ్వర్‌కుమార్, మాజీ గవర్నర్ బాదం బాలకృష్ణ ప్రారంభించారు. మెడికవర్ ఆస్పత్రి వైద్య సిబ్బంది సహకారంతో గ్రామస్తులకు బీపీ, షుగర్ పరీక్షలు, ఈసీజీ, వంటి వైద్య సేవలందించి, మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్‌కు చెందిన మెట్టా రాధ, పున్నరాజు రాజేశ్వరి, సామా రాజేశ్వరి, శ్రీదేవి, సువర్చల, రత్నమాల, రేవంత్, లక్ష్మీనాగేంద్ర, సాయికృష్ణ, తమ్మవరం గ్రామానికి చెందిన గొల్లపల్లి అప్పలరాజు, మెడికవర్ ఆస్పత్రి యూనిట్ హెడ్ శుభాకరరావు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రపర్వం మాండవ్యనారాయణుని పరిణయం

- అలరించిన దీపాలంకరణ
- శ్రీపుష్ప యాగోత్సవానికి సన్నాహాలు



భక్తుల నడుమ కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు



ఆలయంలో కొలువై ఉన్న లక్ష్మీదేవి



విశేష అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత మాండవ్యనారాయణస్వామి

సామర్లకోట: స్థానిక భీమవరం తుల్య భాగ నదీ తీరాన కొలువైన శ్రీదేవి సమేత మాండవ్యనారాయణ స్వామి కల్యాణం ఆలయ ఈఓ బిక్కిన వెంకట్రాయ చౌదరి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నేత్ర పర్వంగా జరిగింది. ఆలయానికి విద్యుత్తు దీపాలంకరణ, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. తెల్లవారు జామున స్వామి వారికి అమ్మవార్లకు మంగళ స్నానాలు, పంచామృతాభిషేకం చేశారు. సాయంత్రం విశేష పూజలు, అంకురార్పణ, ధ్వజారోహణ, భక్త బృందంచే విష్ణు సహస్ర నామ పారాయణ జరిగాయి. స్వామి వారి కల్యాణాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో భక్తులచే చేసిన దీపారాధన ఎంతగానో ఆకట్టుకుంది. వేదపండితుల మంత్రాలతో స్వామి వారి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. కల్యాణాన్ని తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. కల్యాణం అనంతరం ప్రసాద వితరణ జరిగింది. పారిశ్రామిక వేత్త బిక్కిన సత్యపరమేశ్వర సాయి, వల్లూరి బుల్లియ్య కల్యాణ ఉత్సవాలు ముగిసే వరకు ప్రతి రోజు పూజలు, శుక్రవారం మధ్యాహ్నం స్వామి వారి గ్రామోత్సవం ఉంటుందన్నారు. మాండవ్య నారాయణస్వామి భజన మండలిచే పురందర దాసు కీర్తనలు నిర్వహిస్తారని, రాత్రికి స్వామి వారి శ్రీపుష్ప యాగోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని ఈఓ వివరించారు. వేదపండితులు ఖండవిల్లి దుర్గ ప్రశాంతాచార్యుల పర్యవేక్షణలో కల్యాణం జరిగింది. ఆలయ అర్చకులు చక్రవర్తులు రఘురామ్ ఆచార్యులు, రవికుమార్ ఆచార్యులు, పద్మనాభాచార్యులు పూజాదికాలు నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని పురస్కరించుకుని స్వామి వారి అమ్మవార్లను తులసీ దళాలతో అలంకరించారు. ఆలయంలో వెలసిన లక్ష్మీదేవిని వెండి ఆభరణాలతో అలంకరించారు.

శృంగార వల్లభుని కల్యాణం కమనీయం



తొలి తిరుపతి శృంగార వల్లభుని కల్యాణాన్ని జరిపిస్తున్న పండితులు

- గోవిందనామ స్మరణతో మార్మోగిన తిరుపతి
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు

పెద్దాపురం: మండలం తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభుని దివ్య కల్యాణం మంగళవారం రాత్రి వైభవంగా జరిగింది. గోవింద నామస్మరణలతో వేలాది భక్తుల జన సందోహం మధ్య ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాస్, సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో శృంగార వల్లభుడి ఉభయ దేవేరులైన లక్ష్మీదేవి, భూదేవి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప, కొడా చైర్మన్ తుమ్మల బాబు స్వామి కళ్యాణ మహోత్సవాన్ని ప్రారంభించి వీక్షించారు. వందల సంఖ్యలో దంపతులు పీటలపై ఆశీనులు కాగా ఉత్సవ దేవతామూర్తులను ఆలయ అర్చకుడు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు, వేదపండితుల మంత్రాల మధ్య ఆలయం నుంచి మండపానికి తీసుకువచ్చి స్వామి వారి కళ్యాణాన్ని జరిపించారు. దేవదాయ శాఖాధికారులు స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి కళ్యాణాన్ని తిలకించారు. జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి భక్తులు స్వామి వారి కల్యాణానికి వచ్చి స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. భారీ విద్యుద్దీపాలంకరణ, మందుగుండు సామగ్రి, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

11న జ్యోతిరావు పూలే జయంతి

కాకినాడ సిటీ: ఈ నెల 11వ తేదీ మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించనున్నట్టు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11వ తేదీ ఉదయం 10 గంటలకు కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి ఎదురుగా గల మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి జయంతిని ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ షణ్మోహన్ కోరారు.

13న వాసుదేవరావు వర్ధంతి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

కాకినాడ సిటీ: పైలా వాసుదేవరావు 15వ వర్ధంతి సభను శ్రీకాకుళం జిల్లా పలాసలో ఈ నెల 13వ తేదీన సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జె.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సభ కోసం వేసిన పోస్టర్లను, కరపత్రాలను మంగళవారం సాయంత్రం కచేరిపేటలోని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 1967 నాటి శ్రీకాకుళం పోరాటంలో వాసుదేవరావు తన ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలిపెట్టి, దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా విప్లవ పోరాటాన్ని సాగించారన్నారు. పోలీసు, ప్రభుత్వ నిర్బంధాలను లెక్కచేయకుండా జీవితాంతం పీడిత ప్రజల విముక్తి కోసం పోరాడారని కొనియాడారు.

కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆర్.రాఘవులు, ఐఎఫ్‌టీయూ నాయకులు జి.రాజ్‌కుమార్, దుర్గారావు, నాగేశ్వరరావు, చంద్రరావు, తాతారావు, సతీష్, అడపా రాజు తదితరులు పాల్గొన్నారు.

16న నర్తనశాల పౌరాణిక పద్య నాటకం

బోట్‌క్లబ్: తెలుగు నాటక రంగ దినోత్సవం సందర్భంగా ఈ నెల 16వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు స్థానిక దంటు కళాక్షేత్రంలో నర్తనశాల పౌరాణిక పద్యనాటకం ప్రదర్శించనున్నట్టు క్లబ్ అధ్యక్షుడు దంటు భాస్కరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా స్వర్గీయ దంటు సూర్యారావు స్మారక జీవితకాల కళా పురస్కారాన్ని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు అందించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాభిమానులు అందరూ పాల్గొనాలని కోరారు.

ఏపీఎస్పీ ఆధ్వర్యంలో చలివేంద్రం



చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న కమాండెంట్ నాగేంద్రరావు

కాకినాడ రూరల్: వేసవి ఎండల్లో ప్రయాణాలు సాగించే వారికి దాహార్తి తీర్చేందుకు రమణయ్యపేటలో ఏపీఎస్పీ బెటాలియన్ వద్ద పిఠాపురం రోడ్డును ఆనుకుని ఏపీఎస్పీ సిబ్బంది, అధికారులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వేసవి ముగిసే వరకు చల్లని తాగునీటితో పాటు మజ్జిగను పంపిణీ చేస్తామని ప్రారంభోత్సవం అనంతరం కమాండెంట్ నాగేంద్రరావు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ దేవానందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైకులు నడిపిన కేసుల్లో 12 మందికి రెండు చొప్పున రోజుల జైలు, 13 మందికి జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్–1, 2 పోలీసు స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. నిందితులను మంగళవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్‌గా దొరబాబు

కాకినాడ లీగల్: కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్‌గా న్యాయవాది ఎస్.దొరబాబును నియమిస్తూ ప్రభుత్వ సెక్రటరీ జి.ప్రతిభాదేవి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన విధులను ముడేళ్ల కాలపరిమితిని నిర్ణయిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దొరబాబుకు న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

టీబీ విముక్తి పంచాయతీలు 39

కాకినాడ క్రైం: జాతీయ క్షయ నివారణ కార్యక్రమంలో భాగంగా 2024 సంవత్సరానికి జిల్లాకు చెందిన 39 పంచాయతీలు టీబీ విముక్తి పంచాయతీలుగా గుర్తించబడినట్టు డీఎంహెచ్‌వో నరసింహనాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీబీ నివారణ, టీబీ సోకిన రోగులకు సకాలంలో అందించే వైద్యసేవలు, నియంత్రణ కోసం చేపడుతున్న చర్యలు ప్రామాణికంగా ఎంపిక జరిగిందన్నారు. ఆ దిశగా కృషి చేసిన పంచాయతీ సెక్రటరీలకు టీబీ, లెప్రసీ నివారణాధికారి డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లతో పాటు బహుమతులు ప్రదానం చేశామన్నారు.